క్లుప్తంగా

సింగరేణి ఉద్యోగాల్లో న్యాయం చేయండి

దూళ్మిట్ట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద యాదగిరి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ దూళ్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): సింగరేణి ఉద్యోగ నియామకాల్లో సిద్దిపేట జిల్లాలో విలీనమైన పూర్వ వరంగల్, కరీంనగర్ జిల్లా పరిధిలోని మండలాల యువతకు అన్యాయం జరుగుతుందని, వారికి న్యాయం చేసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని దూళ్మిట్ట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలో పరిధిలోని యువతకు సింగరేణి ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ వర్తించేదన్నారు. ప్రస్తుతం జిల్లాలు వేరుగా ఏర్పడటంతో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలో పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాల పరిధిలోని యువత స్థానికతను కోల్పోయారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



పందిల్ల వాగులో పోసిన మట్టిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములు, వాగులు, చెరువులు, నీటి కాల్వలను ఆక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పందిల్ల వాగులో మట్టిపోసి చదును చేసిన పోలు కొమురయ్య భూమిని పరిశీలించారు. వాగులో నీళ్లు పారకుండా మట్టి కట్టలు వేసి అడ్డంగా పైపులు వేయడంతో వరద నీరు పోకుండా పక్క రైతుల పొలాలకు పారుతున్నాయని రైతుల ఫిర్యాదు మేరకు మోక విచారణ జరిపి వాగులో పోసిన మట్టిని తొలగించామన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేటరూరల్: అపరిచితుల ఫోన్లు, లింకు మెసేజ్‌ల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బండచెర్లపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిచితుల ఫోన్‌లకు స్పందించొద్దన్నారు. ఆన్‌లైన్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం రావురూకుల చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలని సీఐ శ్రీను అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముస్త్యాలలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎస్‌ఐ దామోదర్‌తో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలన్నారు.

ఏఎస్‌ఐకి ఉత్తమ సేవా పతకం

చేర్యాల(సిద్దిపేట): విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలను ప్రకటించింది. బుధవారం ఏఎస్‌ఐ నవీన్ ఉత్తమ సేవా పతకాన్ని సీపీ అనురాధ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనను తోటి సిబ్బంది, జిల్లా అధికారులు అభినందించారు.

స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్‌తో భరోసా

సిద్దిపేటకమాన్: లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పించడంతోపాటు వారికి స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ సహాయ సహకారాలు అందిస్తుందని సిద్దిపేట మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్, స్వార్డ్, పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల కోసం సమావేశం నిర్వహించామన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

- కానరాని సేంద్రియ ఎరువులు, వానపాముల ఉత్పత్తి
- బావులు, గుంతల్లో చెత్త పారబోత
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- చర్యలు చేపట్టాలని డిమాండ్

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఇక్కడకు తరలించి వేరు చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఒక్కో నిర్మాణానికి లక్షలు వెచ్చించారు. చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, వానపాముల ఉత్పత్తితో పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన రేగొండ డంపింగ్ యార్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు ఆదాయం పొందాలని వీటి నిర్మాణం చేపట్టారు. కానీ, ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కనిపించడం లేదు. జిల్లాలో 499 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ప్రతీ గ్రామానికి డంపింగ్ యార్డు నిర్మించారు. ఒక్కొక్క డంపింగ్ యార్డ్ నిర్మాణానికి ప్రభుత్వం సుమారుగా రూ.2.50 లక్షలు ఖర్చు చేసింది. జిల్లాలో పట్టుమని పది పంచాయతీల్లో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ లేదంటే అతిశయోక్తి కాదు. చాలా చోట్ల చెత్తను గ్రామాల శివారులో తగలబెడుతున్నారు. అయితే డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారీతో పాటు వానపాములను ఉత్పత్తి చేయాలని వీటిని నిర్మించారు. ఇక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయిస్తే పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుంది. కానీ, చెత్తతో ఎరువు తయారు చేస్తున్నట్లు మచ్చుకైనా కనిపించడం లేదు. అక్కన్నపేట మండలంలోని 32 గ్రామాల్లో ముంపు గుడాటిపల్లి గ్రామం తప్ప మిగిలిన గ్రామాల్లో డంపింగ్ యార్డులను నిర్మించారు. అయితే రేగొండ గ్రామంలో డంపింగ్ యార్డు మరీ అధ్వానంగా తయారైంది. గ్రామంలో సేకరించిన చెత్తను వేరు చేయకుండా డంపింగ్ యార్డు సమీపంలో పారబోసి తగులబెడుతున్నారు. అదేవిధంగా ఎరువుల తయారీ కోసం నిర్మించిన యూనిట్ ఖాళీగా దర్శనమిస్తోంది. అక్కడ ఎరువుల తయారీ, పానపాముల ఉత్పత్తి చేయడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డ్ నిరుపయోగంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. డంపింగ్ యార్డుల్లో ఎరువుల తయారీ, వానపాముల ఉత్పత్తిపై పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెత్తను పారబోసిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం



డంపింగ్ యార్డులను వినియోగంలో తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రతీ డంపింగ్ యార్డులో ఎరువుల తయారీ తప్పనిసరిగా చేయాలి. నిర్లక్ష్యం వహించే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవు.

– భానోతు జయరాం, ఎంపీడీఓ, అక్కన్నపేట మండలం



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రైతు పోరాటాలను గుర్తించడం హర్షణీయం

రైతు సంఘ నాయకులు

హుస్నాబాద్: రైతు పోరాటాలను గుర్తించి కనీస మద్దతు ధర, పంట బీమా చెల్లిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చడంపై బుధవారం రైతు సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు కనీస మద్దతు ధర, పంట నష్టం జరిగినప్పుడు పంట బీమా నెలలో చెల్లిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలియజేశారన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో నెల రోజులు వివిధ రాష్ట్రాల రైతులు సుమారు 30 వేల మంది స్వామినాథన్ కమిషన్ సూచించిన ప్రకారం కేంద్ర ప్రభుత్వం 22 పంటలకు మద్దతు ధర నిర్ణయించాలని ధర్నాలు చేశారన్నారు. రైతుల పోరాటాలను కాంగ్రెస్ పార్టీ గుర్తించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు గడ్డం కొమురయ్య, కల్లూరి భూమయ్య, నమిలికొండ సాంబమూర్తి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

రిక్రియేషన్ క్లబ్ నిర్మాణ స్థల పరిశీలన



రిక్రియేషన్ క్లబ్ నిర్మాణ స్థల మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ శివారులోగల పోలీస్ కమిషనరేట్ కార్యాలయం సమీపంలో జిల్లా అధికారుల రిక్రియేషన్ క్లబ్ నిర్మాణ స్థలాన్ని బుధవారం కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. స్థలం హద్దులను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల రిక్రియేషన్ క్లబ్ నిర్మాణానికి ఎకరం కేటాయించాలని, అందుకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ వెంకటేష్, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ రహమాన్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలకు ఎన్నికలను నిర్వహిస్తోంది. కుకునూరుపల్లి హైస్కూల్ అధ్యక్షురాలిగా సమీనా బేగం, కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల అధ్యక్షురాలిగా కొంతం లావణ్య, లకుడారం ప్రాథమిక పాఠశాల అధ్యక్షురాలిగా రాచకొండ బాల్‌లక్ష్మి ఎన్నికయ్యారు. వీరితోపాటు కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య, రమేష్, ఉపాధ్యాయులు నర్సింలు, రామారావు, శ్రీనివాస్, కవిత, వెంకటయ్య, వీఏఓలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నలువాల వనిత, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎం నారోజు శంకరాచారితో పాటు ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులను కమిటీలో తీసుకున్నారు. పాఠశాలల బలోపేతం కోసం కమిటీలను ఎన్నుకుంటున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.



కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నికైన లావణ్య

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

పీస్ ఫోరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



సెల్‌ఫోన్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న పీస్ ఫోరం సంస్థ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: సెల్‌ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, తమఫోన్‌కు వచ్చే ఓటీపీలను అపరిచితులకు చెప్పొద్దని పీస్ ఫోరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం టెలిఫోన్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగం పెరిగిందన్నారు. ప్రతీ సమాచారం ఫోన్‌లోనే భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ఫోన్‌కు వచ్చే సమాచారాన్ని అపరిచితులకు తెలియజేయొద్దని, ఏదైనా సమస్య ఉంటే 1903 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో పీస్ ఫోరం స్వచ్ఛంద సంస్థ సీఈవో అశోక్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ

సిద్దిపేటజోన్: అకాల వర్షంతో సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో చెట్లు నేలకూలాయి, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రసన్న రాణి, తహసీల్దార్ సలీం, వైస్ చైర్మన్ కనకరాజు తెలిపారు. లింగారెడ్డి పల్లి, ఇమాంబాద్, నాసర్ పూర, మెదక్ రోడ్డు, రంగధాంపల్లి, హైదరాబాద్ రోడ్డులో కూలిన చెట్లు, తెగిన విద్యుత్ వైర్లను పరిశీలించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ సిబ్బంది సమన్వయంతో విద్యుత్ పునరుద్ధరణ చేశామన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



సమావేశానికి హాజరైన నాయకులు

సజావుగా పార్లమెంట్ ఎన్నికలు

- దుబ్బాక సెగ్మెంట్‌లో 253 పోలింగ్ కేంద్రాలు
- అదనపు కలెక్టర్, దుబ్బాక ఆర్‌ఓ గరీమా అగర్వాల్

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్, దుబ్బాక అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని ఐఓసీలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల దృష్ట్యా మూడు చెక్ పోస్టులు, మొత్తం 253 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,99,236 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 96,867 మంది పురుషులు, 1,02,369 మహిళా ఓటర్లు, 58 మంది సర్వీస్ ఓటర్లు, ఆరుగురు ఎన్‌ఆర్‌ఐలు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చిన్నకోడూరు(సిద్దిపేట): అకాల వర్షం రైతన్నలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షానికి పంటలకు నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిర్చి పంటలు నేలవాలాయి. మండలంలో వరి 188 ఎకరాల్లో, 41 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, డీహెచ్ఎస్ఓ సువర్ణ, ఏడీఏ పద్మ, ఏఓ జయంత్ కుమార్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. చిన్నకోడూరులోని పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు సందర్శించారు. తడిసిన గింజలను పరిశీలించి రైతులకు మనోధైర్యం కల్పించారు.

1150 ఎకరాల్లో పంటల నష్టం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వర్షాలకు సుమారు 1,150 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ సంతోష్ తెలిపారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్, వడ్లూరు, బేగంపేట, గూడెం, దాచారం, రేగులపల్లె తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాలను అంచనావేశారు. ప్రాథమిక అంచనాల్లో సుమారు 1,050 ఎకరాల్లో మొక్కజొన్న, 42 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, రేగులపల్లెలో 50 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు.

పంటల నష్టం అంచనా

నంగునూరు(సిద్దిపేట): అకాల వర్షం, వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలు, పండ్ల తోటలను బుధవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వరి, మామిడి తోటలు, కూరగాయ పంటలను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏఓ గీత దర్గపల్లిలో మామిడి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల నష్టం నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వరుణ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్



లక్ష్మీపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న



దర్గపల్లిలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో ఆయిల్ ఫామ్ సాగు విధానంపై స్పిక్, గ్రీన్‌స్టార్ ఫర్టిలైజర్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.సురేష్ మాట్లాడుతూ చీడపీడల నివారణ, అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో వరి, మామిడి తదితర పంటలలో జరిగే నష్టాల నివారణకు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయ సాగుతో కలిగే లాభాలను వివరించారు. ఏటా భూసార పరీక్షలు చేయించుకోవాలని రైతులకు సూచించారు. నీటి యజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బాలమురుగన్, ఆయిల్ పామ్ ఏరియా ఆఫీసర్ రాము, అశ్విని ఫర్టిలైజర్ డీలర్ పెర్యాల చొక్కరావు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

స్వయం ఉపాధితో ఉన్నత స్థానం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్: ఉద్యోగాల కన్నా స్వయం ఉపాధి మార్గాలు తృప్తినిస్తాయని, ఉన్నత స్థానాలకు చేరుస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ విభాగం తరుపున విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా బుధవారం స్థానిక పాలశీతలీకరణ కేంద్రాన్ని సందర్శించారు. వివిధ గ్రామాల నుంచి పాలు సేకరించే విధానం, వాటిని శీతలీకరించి కాపాడే విధానాన్ని నిర్వాహకులు నాగయ్య, తిరుపతి రెడ్డి, రాంరెడ్డి వివరించారు. అనంతరం ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ విభాగం బాధ్యురాలు డాక్టర్ పంజాల పద్మ మాట్లాడుతూ భారత దేశంలో డెయిరీ పరిశ్రమ ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆ అవకాశాలను అందుకొని గొప్పగా ఎదగాలని సూచించారు. గ్రామస్థాయిలో ఉండే వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ద్వారా ఉపాధి పొంది దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎలూరి కోమల, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.రేణుక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బూర్ల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల సేకరణ విధానాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ వాహనాల తనిఖీకి ఆదేశం

ములుగు(గజ్వేల్): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట జిల్లా సరిహద్దు గ్రామం ములుగు మండలం వంటిమామిడి రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మద్యం, మాదకద్రవ్యాల రవాణా కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు.

◆ నష్టపోయిన రైతులను ఆదుకోండి

తొగుట(దుబ్బాక): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పంటచేతికి అందే సమయంలో మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

◆ స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగం

మద్దూరు(హుస్నాబాద్): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండల పరిధి కొండాపూర్ గ్రామంలో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామీణ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

◆ చట్టాలపై అవగాహన తప్పనిసరి

మిరుదొడ్డి(దుబ్బాక): చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో నేరాలు తగ్గుముఖం పడతాయని మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిన పర్శరామ్ అన్నారు. మండల పరిధిలోని చెప్యాల క్రాస్ రోడ్డులోని గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర (పాత) స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా శ్రీ భూనీలా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ 54 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీ హవనం, ప్రత్యేక పూజలు, స్వామి వారి ఎదురుకోలు వైభవంగా కల్యాణం నిర్వహించారు.

◆ ఆస్తిపన్ను చెల్లించండి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు తమ ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య బుధవారం అన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివో బయోటిక్ పరిశ్రమ నుంచి రూ.7,48,234 పన్ను వసూలు చేశామన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి పన్నులు చెల్లించాలన్నారు.

◆ ఆహారంలో చిరుధాన్యాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విరివిగా లభించే చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు, మెలకువలు తెలిపారు.

◆ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోషకాహారాన్ని పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ జయమ్మ సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కవిత, సూపర్‌వైజర్లు నాగరాణి, కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

◆ మృతుడి కుటుంబానికి చేయూత

గజ్వేల్‌రూరల్: మృతుడి కుటుంబానికి ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ చేయూత అందించారు. మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన రైతు మంగళి వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చక్రధర్‌గౌడ్ బుధవారం గ్రామానికి చేరుకొని వెంకటయ్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.